ప్రతిమనిషీ కాలేడు. ఎందుకంటే నాకూ, చాలామంది తక్కిన వాళ్ళకీ ఒక్క భేద ముంది. అది నన్ను ప్రేమించే స్త్రీ నా కిచ్చిన ఆత్మబలం, విశ్వాసం! ప్రేమగల స్త్రీలు ఈ కాలంలో పురుషుడిలో వుండే లోపాల్ని జాగ్రత్తగా వెతికి, అతను ఎందుకూ అసమర్థుడనీ, ఒకవేళ అతను ఏ ఉద్యోగంలోనో, కళలోనో కొంత అధిక్యాన్ని సంపాయిస్తే, అది ప్రజల మూర్ఖత్వంవల్లనో, అతను చేస్తున్న మోసంవల్లనో తటస్థించిందని వాదించి, తమ భర్తల ధైర్య స్థైర్యాన్ని గుంజి, చంపడంలో తమ ప్రేమాధిక్యాన్ని నిరూపణ చేసుకుంటున్నారు. కాని ఏ అదృష్టంవల్లనో, ఈ కుసుమ నాలో విశ్వాసాన్ని ప్రతిష్టించి, నన్ను రగిల్చి, సాధారణమైన మానవుణ్ణి ఒక ప్రతిభావంతుణ్ణి చేసింది. అదీ భేదం.

ఇక మనం లేవవచ్చు.

★

# దెయ్యమేనా ?

ఆ నాటకం, చావని ముసలి పీనిగమల్లే. యీడ్చుకుని యీడ్చుకుని సమాప్తి చెందేప్పటికి సరిగ్గా నాలుగయింది. మూడణాలు చెల్లించడము వల్ల—ఆ విలువ పూర్తిగా గ్రహించందే బయటికి రాబుద్ధి బుట్టలేదు.

"ఇప్పు డేం నిద్ర? పదండి క్రిష్ణ ఒడ్డుకి స్నానంచేసి హోటలికి చేరుకుందాము" అన్నాడు ఒకడు.

రామమోహన లైబ్రరీ దగ్గిర బ్రిడ్జిదాటి కాలవకీ నదికీ మధ్య యెత్తుగా ఉన్న గట్టునే నడుస్తున్నాము. ఓ చేతిపక్క అన్ని కష్టాలూ మరిచి నిద్రపోతున్న పట్టణమూ, రెండో చేతివేపు వెన్నెట్లో నిద్రపోతున్న ఇసికా, దూరంగా సీతానగరం కొండల ప్రక్కన నిద్రపోతున్న నది పాములాగు అల్లుకుని పడుకుంది. గట్టుకిందవున్న తోటల్లోంచి అవ్యక్తమయిన పరిమళాలు-అప్పుడే వికసించే పువ్వులోంచిగావును- వాస్తున్నాయి. అప్పుడప్పుడో కోడికూత, మా అడుగుల చప్పుళ్ళు విన్న కుక్క అరుపు....మాలో ఒకడు వెనక్కి తిరిగి "ఆ మంట ఏమిటి ?" అన్నాడు.

"శవం"

"ఒరే దెయ్యాలు-దెయ్యాలు అంటారు. ఒకటీ కనబడవేం ?"

"అన్నట్టు నేను దెయ్యం కథ చెపుతాను వినండి. నేను స్వయంగా ఎరిగిన విషయం."

"వొద్దుగాని, నాకు దెయ్యాలే కనబడితె-కామ దెయ్యాలు, అవి కనబడితే బావుండును."

"ఎందుకు?"

"ఆ తమాషా, ఆ అనుభవం ఎట్లా ఉంటుందోనని."

"కాని వాస్తవం కాని ఆ మాయ మనుషులతో ఏం సౌఖ్యం?"

"ఈ మనుషులు మాత్రం నిజమా? వీళ్ళు కల్పనలేనేమో!"

"అయితే లోకమే అబద్ధం."

"ఆ ఆడదెయ్యాలు మనిషిని రక్తమాంసాలు పీల్చేస్తాయట."

"ఈ నిజమైన ఆడవాళ్ళు అంతకన్నాను!" అన్నాడు సినిక్.

కొంతసేపటి కిందట మమ్మల్ని కలుసుకుని ఒక పల్లెటూరు కుర్రాడు ఆ దోవనే నడుస్తున్నాడు. అతను "అయ్యా! రెండు నెలల కిందట ఒక సంగతి జరిగింది. చెబుతాను, వింటారా? నిజమయిన సంగతి." అన్నాడు.

"చెప్పు."

"మాది యీ జిల్లా కాదు. ఈవేపు వాణ్ణి అయితే మీతో యీ కథ చెప్పనే చెప్పను. కారణం చివరికి మీకే తెలుస్తుంది. మాదొక పల్లెటూరు. రెండుమైళ్ళ దూరంలో యింకొక పల్లె ఉంది. దాంటోనండీ, ఇంకో వూరు మునసబు ఒక బ్రాహ్మణామెను వుంచాడు. నే నాయన కింద కమత గాణ్ణి. ఆయన చాలా పలుకుబడిగలవాడు. వోట్లకూ - దానికీ గొప్ప గొప్ప వారు వొస్తారు ఆయన యింటికి. ఈ వ్యవహారం పైకి తెలియడం ఆయన కిష్టంలేదు. వారానికి రెండుసార్లు బాగా చీకటి అయింతరవాత వొస్తాడు. తెల్లవారకముందే వెళ్ళిపోతాడు. ఆయన వూరినుంచి మా పల్లెకు నేను ఆమె యింటి ముందునించే వెళ్ళాలి. వొచ్చే రోజున ఆమె స్నానానికి నీళ్ళూ, భోజనమూ, గంధమూ, పూలూ, అన్నీ సిద్ధంగా వుంచుతుంది. అందుకని నా చేత ఆమెకు కబురు పంపేవాడు, ఎప్పుడన్నా ఆయనకు రావడానికి వీలులేకపోతే :

ప్రతిరోజూ నేను ఆ దోవనే వెడతాను గనక నాకోసం ఎదురు చూడడం ఆమెకు మామూ లయింది.

"మునసబుగారు ఈ రోజు రారు" అని నేను చెపితే,

"ఇట్లా చూడు - ఇవన్నీ యేం చేసుకోను?" అని నన్నడుగు తుంది.

ఆమె నిరాశ చూసినప్పుడు నాకు దిగులు వేసేది.

"ఏం చెయ్యను, యీ భోజనమంతా ? నువ్వయినా తిని వెళ్ల", అంటుంది.

ఓ రోజు ఆమె పుట్టినరోజు పండగ. మునసబుగా రామెకి నేల మంచు పట్టుచీరె పంపారు.

"ఈ సాయంత్రం తప్పకుండా అయ్యగార్ని రమ్మను" అంది. నేను సాయంత్రం తిరిగి వెళ్ళి "మంత్రిగారు అవసరంగా కబురు పంపితే

కథా నిలయం
161
శ్రీకాకుళం

పట్నం వెళ్ళా"రని చెపితే, ఆమె మొహం చూడవలసిందే. తలంటి పోసుకుని, ఆమె పెద్ద జుట్టు వేళ్ళాడేసుకొని దొడ్డి గుమ్మంలో నుంచుంది. దొడ్లో టీరపువ్వులూ, చంద్రకాంతలూ వికసిస్తున్నాయి. బావి దగ్గర బురదలో చేమ మొక్కలు బాగా పెరిగాయి. సాయంకాలపు ఎండ ఆమె పచ్చని వొంటి మీద పడుతోంది. ఆమె విచారం చూస్తే నాకే దిగులు వేస్తోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అంది.

"మీ విచారం."

ఆమె నవ్వింది.

"తరవాత."

"ఇంకేముంది నాకు? మీ విచారమే."

"నాకు విచారం లేదు నాయనా, నీవు వున్నావు గదా" అని నా తలను తనకు అదుముకున్నది.

భోజనంచేసి అక్కడే పడుకున్నాను. అటు తరవాత మునసబు రాని విచారం ఆమెకి వుండేదికాదు. మునసబు పోషిస్తున్నాడన్న మాటే గాని, మర్యాదలో చిక్కి తన వస్తువును తాననుభవించే యోగ్యతనే పోగొట్టుకున్నాడు. నేనయితేనా అటువంటి మనిషికోసం,మునసబు మర్యాదా కాదు. ఆ వోట్లు తీసుకునే మంత్రుల మర్యాద కూడా తన్నేసి వొస్తాను. కాని మా వూళ్లో బడిపంతులంటాడు కదా. ఆ మంత్రులకి, నా శారదమ్మని తలదన్నే మనుషు లుంటారనీ—వారే మంత్రిత్వాన్ని నడుపుతారనీ.

మాకు తెలియకుండా మునసబు వొస్తాడేమోనని భయం వుండేది గాని, ఆ యింటికి మంచి అందుబాటులో చక్కని దొడ్డిదారి వుంది.

ఆనాడు నాకు మునసబుగారు పని చెప్పారు, తెల్లారకట్టే లేచి యింకో వూరికి కబురు తీసుకుపొమ్మని. ఆ రాత్రి మునసబుగారొచ్చే రాత్రి కావడం చేత మా యింట్లోనే పడుకున్నాను. కాని శారదమ్మగారితో

సాయంత్రమేకాలం గడిపి వొదలలేక వొదలలేక యింటికి వెళ్ళాను. కాని పడుకున్నా, మునసబు రావడమూ, పక్కమీద నేను పడుకున్నచోటే పడుకోడమూ నేను వొత్తిగిలి అనుకున్నచోటే అనుకోవడమూ, ఆమె యిష్టంలేని యిష్టం నటించవలసి రావడమూ తలుచుకుని బాధపడి ఆమె రూపధ్యానంతోనే నిద్రపోయినాను.

కోడికూతకు లేచి బయలుదేరాను. పెద్ద చంద్రుడు చేలమీద నవ్వుతున్నాడు. తుమ్మలోంచి చల్లగాలి వీస్తోంది. మునసబు లేస్తాడు, వెళ్ళేప్పుడు మళ్ళా శారదమ్మను అనుభవిస్తాడు అనుకుంటో దోవవెంబడి పోతున్నాను. చేల వెనక తుమ్మల అడివి నల్లగా కనబడుతోంది. వెనక గడ్డిబండ్లు వొస్తున్నాయి గావును, యెద్దుల మెళ్ళో గంటలు వినబడుతున్నాయి. నా ముందు చాలా దూరంగా వొంతెనమీద యెవరో కూచున్నారు. దగ్గిరికి వెళ్ళకముందే నే నెవరో యెరిగిన వారని తోచింది. అకారణమయిన భయం వేసింది. దగ్గిరకు పోయి అప్పుడు చూద్దును గదా శారదమ్మే !

జుట్టు విరబోసుకుని వుంది. అయితే రాత్రి పూలు పెట్టుకుని జడ వేసుకుందే అనుకున్నాను. జుట్టు వొంతెన్నీ ఆమె రొమ్మునీ లిప్పుతోంది. తెల్లని చీరె, నేను సాయింత్రం చూపిన మజిలిను రెవిక-పైకి యెత్తిన చేతులు-మీద వెంట్రికలు- ఆమే- ఆమె నా వంక తల యెత్తక కళ్ళు కప్పుకొని యేడుస్తోంది. నివ్వెరపోయినాను.

"ఏమిటిది?"

చప్పున లేచి చెరుగుతో కన్నీళ్ళు తుడుచుకుంటో "వొచ్చావా-వెనక బళ్ళు వొస్తున్నాయి, ఇట్లా రా" అని నన్ను పక్క పొంత దారిలోకి తీసి కెళ్ళింది. అది అడవిలోకి పక్కదారి. నేనా దారిని తెల్లవారకట్ట వెడతానని శారదమ్మతో సాయింత్రం చెప్పి వుండడంవల్ల నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. మాట్లాడకుండా వడిగా నడుస్తోంది.

"ఏమిటి చెప్పు. ఇంక భయంలేదు. ఇక్కడ చెప్పు."

"రా, చెపుతా"

"చెపితేగాని రాను."

"నాయనా - నీవు వెళ్లావా? ఆయన వొచ్చాడు. ఎవరో చెప్పారట; మన సంబంధం తెలిసింది. నన్ను చావకొట్టి తరిమేశాడు. ఏంచెయ్యను? చద్దా మనుకున్నాను. నిన్ను విడిచి ఎట్లా చావను? వొచ్చేశాను."

"ఏం చేద్దాం?"

"....లూరు, పోదాం. అక్కడ మావా ళ్ళున్నారు. ఆ వూరు పోవ డానికి అడివి దాటాలి."

"నేను...."

"నువ్వు కనబడ్డావా చంపుతాడు. రా"

"మరి...."

"ముందుకు రా, తర్వాత మాట్లాడుకుందాము."

ఎప్పటికంటే అందంగా వుంది. నా దగ్గిరికి వొచ్చి లాలించదేమా అనుకున్నాను! గాని నా మనసంతా ఆమెకి తటస్థించినకష్టం మీద వుంది. ఏం చేసుకోను యీామెని! మా అమ్మ యామంటుంది? ఎట్లా బ్రతుకుతాము దగ్గరున్న యిరవైమూడు రూపాయలు యెన్నాళ్ళు వొస్తాయి? అని యోచి స్తున్నాను.

ఆమె నడుస్తోంది. నేను వెనకనే వెడుతున్నాను. కారణంలేని అను మానమూ భయమూ కలిగినయి. కాని అవే రొమ్ములు— ముందుకు విపరీతంగా కొనలు తేలినవి. అవే పిరుదులు— జుట్టులోంచి ధవనం వాసన— ఆమె మొహానికి యెప్పుడూ రాసుకునే రాజా స్నో పరిమళం— ఎట్లా సందేహించను?

పొదలు తప్పించుకుంటో, చర చరా, ముళ్ళూ, తేళ్ళూ, భయం లేకుండా వెడుతోంది. ఆ తప్పించుకునే నేర్పరితనమే నా కనుమానం వేసిందనుకుంటాను. మళ్ళా చూశాను—ఛా—ఏమిటా భయం? ఆమె

వీపు మీద నా నీడ పడుతోంది. వెన్నెట్లో ఆమె భుజాలు చూసి ఆమెని ఆ చేలల్లో ఆ గట్టున అక్కడే పడుకోపెట్టా లనిపించింది— చల్లని ఆకాశం కింద. కాని భయంతో వొణికాను. నాకు అందకుండా నడుస్తోంది. భుజం మీద చెయ్యి వెయ్యాలని తొరగా నడిచాను. అందలేదు. ఆ మా వేగం హెచ్చింది. చప్పున ఒక సంగతి జ్ఞాపకమొచ్చింది— శారదమ్మకు అమిత భయం. నా చెయ్యి పట్టుకునిగాని మంచం దిగదు రాత్రిళ్ళు— ధైర్యంగా యిప్పుడు "ఆగు" అన్నాను, అధికారంతో. నే నాగాను. ఆమె ఆగింది.

ఎగా దిగా చూశాను. ఇంకా చెంపలమీద కన్నీళ్ళు. పాపం, వెన్నెట్లో మెరుస్తున్నాయి.

"ఎవరు నువ్వు?" అన్నాను.

దిగులుతో చూస్తోంది.... ఆ చూపు— పేగులు గద్దకదతాయి. ఈ లోకపు విచారం కాదు. అన్ని ఆశలూ పోయి— నశించి— బూడిద అయిన చూపు.

"నీకు తెలీదూ?"

"తెలీదు. ఎవరు నువ్వు?"

చప్పున పక పకా నవ్వింది. ఆ నవ్వు — అది మాంసములేని పెదవుల్లోంచి— చీకిపోయిన బొమికల గల గల శబ్దాన్ని ధ్వనింపచేసే నవ్వు.

గద గడా వొణికాను: నిర్మానుష్యమయిన ఆ చెట్ల మధ్య ఆమె ఆకారము మారిపోయినట్టు తోచింది.

ఆమె కాదు, నిశ్చయ మయింది.

ఎట్లా! ఏం చెయ్యను? ఎట్లా తప్పించుకోను?

పిచ్చి దేమో ననుకున్నాను నేను. కాని పిచ్చిది యిన్ని వేషాలు

వెయ్యదు. పిచ్చికి కూడా ఒక ధోరణి ఉంటుంది అనుకున్నాను గావును, పిచ్చిది అనిపించలేదు.

ఎట్లా; నా సంగతి ఏమిటి?

పారిపోతే రోడ్డుమీదికి! వెనక్కి తిరిగితే దెయ్యాలు చంపేస్తాయని జ్ఞాపకం వొచ్చింది. జుట్టు చిక్కించుకుంటే స్వాధీనమవుతాయి యీ భూతాలు.

"శారదమ్మా."

"ఏం?"

"ఇట్లారా."

అని దగ్గిరగా వెళ్ళి చప్పున దూకి జుట్టువేపు చెయ్యి జాచాను ఏమయిందో తెలీదు. దూరంగా వెళ్ళి అందకుండా చేతులు జాచి నవ్వుతో "రా" అంది.

వెళ్ళాను. తానూ వెనక్కి తిరిగి నడిచింది. నడిచాము. ఎందుకు వెళ్ళానో?....ఆగితే చంపుతుందేమోనని భయం. వెడితే! అడవిలోకి తీసుకు పోయి పీక్కు తింటుందేమో— ఆగితే యిక్కడే తింటుంది చుట్టూ చూశాను. ఎవరూ లేరు. ఆమె వంక చూశాను. శారదను నిన్న సాయంత్రం నన్ను ప్రేమతో కావలించుకొని యేడ్చింది శారదమ్మే! అదే నడక! అదే మనిషి! ఎంత విచిత్రం! నన్ను తింటుందా? అంత ప్రేమించి! దెయ్యమయితేనేం? నామీద కోపం ఎందుకు? పాపం! ఆ మునసబు అంతా తెలిసి నరికాడు గావును! ఇప్పుడు చూడను శారదమ్మని: ఆ పైకి క్రిందకి స్ప్రింగులాగు వూగే రొమ్ముల్ని, ఆ నున్నని తొడల్ని.... ఆ పెదిమ కొరకడాలు, ఆయాసం— ఆమె యిక లేవు. నిజంగా శారదమ్మ కాదా? ఒకసారి తెలివి రాకూడదూ? ఆమెకి? నన్ను గుర్తించి ప్రేమతో చూడ కూడదా?

"శారదమ్మా."

"మాట్లాడకు. రా. ఆ యేటి గట్టున చెట్టుకింద— అందులో వుంటుంది. రా."

నా కంఠం విని నా ఆశ గ్రహించి ఉంటుంది. నాకేమీ అపాయం చేయదు-అని ధైర్యం చెప్పుకొని పోతున్నాను.

వంతెన— యేటిగట్టు చేరాము- నల్లని చింతచెట్టు నీడలోకి ఒక్క ఉరుకు ఉరికింది.

"రా"

"రాను"

"రా, మాట"

"ఎవరు చంపారు నిన్ను?"

"నన్నా?"

"చంపారు నిన్ను!"

"నన్నా?"

"చంపారు నిన్ను. పాపం, దెయ్యం. నువ్వు దెయ్యం. నేను ఆంజనేయుల్ని తలుచుకుంటాను."

"ఏ ఆంజనేయులు? ఇట్టారా"

"రాను. పో. పిశాచీ"

చీకట్లో తెల్లగా దీనంగా నుంచుంది.

"రావూ?"

ఎవరో వొస్తున్న చప్పుడు.

"పోనీలే. వెడతాను."

నవ్వుతో నీళ్ళలోకి దూకి మాయమయింది. నేను నీళ్ళలో చలనము లేకుండా తేలే చందమామను చూచి ఆశ్చర్యపడుతున్నాను.

మళ్ళా పల్లె ఎట్లా చేరుకున్నానో తెలీదు. ఒకటే ధ్యాస- శారదమ్మ శవాన్ని చూడాలని. ఒక్కసారి ఆమె చేతిని తాకాలని-మూసుకున్న ఆ కళ్ళని-బిగుసుకున్న ఆ రొమ్ముల్ని-చూడాలని సరాసరి ఆ యింటి దగ్గిరికి పోయినాను. ఇంకా బాగా తెల్లవారలేదు. మునసబు ఇంకా ఉంటాడా, అంత పని చేసి-తలుపు కొట్టాను. తీసేవుంది. గుండెలు కొట్టుకుంటో లోపల అడుగులో అడుగు పెట్టాను. చీకటి - మెల్లిగా వెలుగులో మంచం దగ్గిరికి అడుగువేస్తో వెళ్ళాను. ఎక్కడ రక్తంలో అడుగుపడుతుందో-మంచంమీద -ఏ మిటది? తెల్లగా పడివుంది. అదే చీరె-అదే స్నో వాసన-ఆ దెయ్యమే వచ్చిందా? శవమా? మెల్లిగా చేతిమీద చెయ్యి వేశాను. చప్పున పట్టుకుని కళ్ళు తెరిచి చూసింది. "రా పడుకో" అంటోంది.

నేను కెవ్వున కేకవేశాను. పక్కమీదినించి దూకింది. నేను వీధిలోకి ఒక్క పరుగు తీశాను. వొచ్చి గుమ్మంలో నుంచుని ఆశ్చర్యంతో చూస్తోంది. పదినిముషాలు పట్టింది నాకు; బతికివున్న శారదమ్మేనని నమ్మడానికి. లోపలికి పోయి కావలించుకుంటే ఆనందంలో మధ్య మధ్య భయం....

కథంతా చెప్పాను.

"అన్నా! చచ్చిపోయి ఉందువుకదా! అది ఎవత్తో - ఎందుకు పిశాచ మయిందో! ఏ కోర్కెలు దానికి తీరలేదో! మన సంగతి యెట్లా కనిపెట్టిందో! నేను చచ్చినా, నీకు అపకారం తలచగలనా?" అంది

తెల్లార కట్ట జరిగింది కల ఏమో అనుకున్నాను. కాని మధ్యాహ్నం మా వూళ్లో బండి శేషన్న కనపడి-

"ఏమిటి వెంకన్నా," తెల్లారకట్ట ఆ వొంతెనమీద కూచుని ఎవరో ఆడమనిషి నీతో మాట్లాడుతోంది? ఎవ రేమిటి?" అని అడిగాడు

ఏమంటారు?

★